సీతకథ

"ఊర్వశి"

సాధారణ ఎన్నికలు వచ్చాయి. వెళ్ళాయి. అయిదు సంవత్సరాల క్రితం. మళ్ళా ఎన్నికలు వచ్చాయి. వెళ్ళాయి. ఈ రెండింటికి మధ్య పంచాయితీ ఎన్నికలు, మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. వెళ్ళాయి. మంత్రులు, ఎమ్. ఎల్. ఏలు క్రొత్తవారొచ్చారు. పాతవారు వెళ్ళిపోయారు. ఆసక్తి, చొరవ, సామర్థ్యము. కార్యదీక్ష ఉన్నవారు చేయగలిగిన సేవచేసి, గ్రామాలలోను, తాలూకాలలోను, జిల్లాలలోను, రాష్ట్రాలలోను మంచి మార్పులు తెచ్చారు. అలానే ఏ మార్పూ రాని గ్రామాలు ఉండిపోయినయి. మనుషులు ఉండిపోయారు. ఏదో సమయంలో ఊహించని మార్పు వస్తుందన్న ఆశాభావంతో జీవించేవారితో పాటు, ఏ మార్పు రాదన్న నిరాశాభావంతో జీవించేవారు కలనేతచీరలా పొడవున వెడల్పున అల్లుకుని పోయిన ఆ గ్రామంలో చిరిగిన చీరకున్న మాసికల్లాగ పాడుపడిన యిళ్ళు, ఎండిపోయి కూలిపోయిన బావులు, రామాలయం దగ్గర ఎండీఎండని చెఱువు, పోగులూడిన చీర అంచుల్లా పండీపండని వర్షాధారపు భూములు, ఉన్న ఆ గ్రామంలో సీత కూడ ఉంది. సీతకు ఒక కలనేతచీర ఉంది. ఆ చీర క్రొత్తదేం కాదు. కాని ఆ చీరంటే సీతకు యిష్టం. అందుకు కారణం లేకపోలేదు.

వెన్నెల రాత్రులన్నీ ఆనందాన్నిచ్చేవని అనలేం. అలానే చీకటిరాత్రులు ఆనందాన్నియ్యవనీ అనలేం. నిజానికది చీకటిరాత్రే. కాని సీతకుమాత్ర మది వెన్నెల రాత్రే. ఆ వెన్నెలకూడ ఒక రోజుతో వెలిసిపోయే వెన్నెల కాదు. జీవితాంతం కాయవలసిన వెన్నెల. ఆ రోజు సీత ఆ చీరే కట్టుకుంది. అది ఆ నాటికి సరిక్రొత్తచీర. ఆ రోజు ఆ క్రొత్తచీరను ఎందుకు కట్టుకుందో సీతకు గుర్తులేదు. కాని ఆ రోజు— ఆ కొబ్బరిచెట్టు—ఆమె మనసున కాచిన వెన్నెల ఆమెకు గుర్తు. వాటితోపాటు అతిముఖ్యమైన దొకటి ఆమెకు గుర్తు. కాని ఆ విషయాన్ని సాహసించి ఎవరికీ చెప్ప లేదామె. చెప్పదు కూడ.

క్రొత్త ఎన్నికలు వస్తున్నాయంటే పాత ఎన్నికలు గుర్తుకొస్తాయి. పాత ప్రమాణాలు జ్ఞాపకానికి వస్తాయి.

సీతకు కూడ జ్ఞాపకాలు బోలెడు.

సీతకు ఎన్నికల గురించి ఏమీ తెలియదు. ఆమెకు తెలిసిందల్లా, తమ యింటికి వచ్చేవారందరికీ భోజనం పెట్టవలసి ఉంటుందన్నది మాత్రమే. తల్లి మంచం ఎక్కడంచేత వంటవడ్డన తానే చేయవలసి ఉంటుందన్నది, అన్న, సూర్యం చెప్పగా గ్రహించింది సీత. తనకు ఓటుహక్కు వచ్చిందని, దాన్ని తను సద్వినియోగపరచుకునే అవసరముందని సూర్యం చెప్తే ఆమెకు తెలియలేదు. ఓటు అంటే ఏమిటో, దానినేవిధంగా చెయ్యాలో సీతకు తెలియదు. కాని తెలిసికోవాలని మాత్రం ఆమె మనసులో ఉంది. ఎవరిని అడగటమో ఆమెకు తెలియదు. ఆమె ఎనిమిదవ తరగతి వరకు ప్రక్కఊరి బడిలో చదువుకుంది. కాని ఆ బడిలోనూ ఆ విషయాల గురించి ఎవరూ ఏమీ చెప్పలేదు. అంతే కాదు. కందిపప్పు ఉడక్కపోతే ఏంచెయ్యాలో, కాకరకాయకూర నెన్నివిధాలగా చెయ్యవచ్చో, సాంబారుపొడిని ఎలా తయారుచేసికోవాలో, అప్పడాల నెలా వత్తాలో—మరి యిలాటివాటి గురించి, ఎవరూ ఏమీ చెప్పలేదు. కలపమన్నారు. తీసేయమన్నారు. గుణించమన్నారు. భాగించమన్నారు. సీతకా చదువేమీ నచ్చలేదు. ఆ వయసులో ఆమెకు—ఆశల కలుపుకొని నిరాశల లేపివేయుటమే జీవితమని గాని, సామాన్య కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల, కోర్కెల భాగించుకొని, నిరాశల గుణించుకోవాలనిగాని తెలియదు.

సీతకు తన అందం గురించి తెలుసు. అందుకామెకు అహంభావం లేదు. ఎవరు చూడకుండ ఉంటే

తన అందాన్ని చిన్నద్దంలో తనివితీర చూచుకొని నిర్లిప్తంగా నవ్వుకుంటుంది. సీతవి పెద్ద కళ్ళు. ఆమెది పొడవైన నల్లని జుత్తు. తెల్లని అందమైన పొందికైన శరీరం. చదువుకునే రోజుల్లో తోటి స్నేహితురాండ్రనేవారు సీత అందమైనదని. చదువు మానేసి యింట్లో కూర్చుని, చిరిగిన తల్లి చీరలను ఓణీలగా మార్చుకొనే రోజుల్లో, సాయంత్రం వేళల్లో చెఱువుకు మంచినీటికి వెళ్ళొచ్చేవేళల్లో, ఊళ్ళో వాళ్ళనుకునేవారు సీత అందమైనదని. పెద్ద ముత్తైదువు లనుకునేవారు సీత ఏ అదృష్టవంతుని యిల్లాలవుతుందో అని. అన్నిటిని విని తృప్తిగా నవ్వుకునేది సీత. సీతను వెతుక్కుంటూ ఏదో రోజున, ఆమెకు కాబోయే భర్త తన యింటికి వస్తాడని సూర్యాని కొక ధైర్యం; చెల్లెల్నిచూచి గర్వంతో నవ్వుకుంటాడు కరణం సూర్యం.

సీతకు వంటావార్పు, కుట్లు, అల్లికలు అన్నీ చేతనవును. కాని ఆమెకు చేతకాని దొకటే. ఉదయం సాయంత్రం నీళ్ళకు వెళ్ళివచ్చే తనను ఎన్నో కళ్ళు, ప్రశంశతో; ఆరాధనతో, వికారంతో, చూస్తున్నా తల యెత్తి ధైర్యంగా ఆ కళ్ళలోకి చూడటం ఆమెకు తెలియదు. ఆమెకు అదే చేతనయివుంటే ఆమె గురించి చెప్పటానికి నేను శ్రద్ధవహించే వాడనేకాను. అయితే సీత గురించి ఎందుకు చెప్తున్నానంటారేమో; మాధవరావు గురించే. ప్రతి గ్రామంలో సుమారుగా ప్రతి మధ్యతరగతి కుటుంబంలో సీత ఉంటుంది. అలానే సమాజంలో, మనచుట్టూ, మనతో కొందరు మాధవరావు లుంటారు. వాళ్ళను దాచుకున్న సమాజం ఉంది. ఆ సమాజం కోసమే ఈ కథ.

సుమారుగా కాకపోయినా, అయిదు సంవత్సరాల క్రితం.

ఆ ఊరి ఎలిమెంటరీ స్కూలు దగ్గరకి రేపు ఎన్నికలు అనగా ముందురోజే మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ లారీవచ్చి ఆగింది. ఆ లారీలోంచి మగ, ఆడవాళ్ళ విభాగాలకు చెందిన ఎలక్షన్ సిబ్బంది దిగింది గోనెమూటలతో, ఎయిర్ బ్యాగులతో. వారి కన్నా ముందుగానే పోలింగు ఆఫీసర్లు, పోలింగు క్లర్కులు వచ్చి చేరారు. ఆడవారి విభాగానికి చెందిన సిబ్బందిలోనివాడే మాధవరావు.

భుజములమీద క్రొత్తగా పెట బడిన బాధ్యతల నొకసారి గుర్తుకు తెచ్చుకుని ఆఫీసర్లు లారీ దిగుతూ చుట్టూ కలయ చూశారు.

లారీదగ్గర చేతులు కట్టుకుని హాజరైనాడు మునసబుతోపాటు కరణం సూర్యం.

'తలయారీ ఎక్కడ? లారీ రాగానే సామాను తీసికెళ్ళటానికి రావద్దా? మునసబు ఎవరు? కరణం గారు వచ్చారా? పోలింగుస్టేషన్లు యివేనా? యివే నటండీ? ఫర్నీచర్ అంతా యిదేనా? పోలింగ్‌బూత్స్ యింకా కట్టలేదేమండీ? మేమే కట్టుకోవాలా?... ఇత్యాది ప్రశ్నలు ప్రారంభమైనాయి. మునసబుతో కరణం హోదాలో సమాధానాలు యిచ్చాడు సూర్యం.

'ఏమండీ కరణంగారో, మునసబుగారో, ఖాతా ఎవరో ఒకరు రెండు బాల్చీలు, రెండు చెంబులు, నీళ్ళూ పెట్టించండి. మాకు భోజనం ఏర్పాట్లు ఏమైనా చేయించారా? లేకపోయినా ఫరవాలేదు. ఈ ఊరిలో హోటలు ఏదైనా ఉంటే చూపించండి. పోతాం...'

'అయ్యా! మా పల్లెటూరిలో భోజనహోటలు ఏదీ లేదండి బాబూ! మీలో మాంసాహారు లెంత మందో, శాఖాహారు లెంతమందో తెలియక నా యింటి దగ్గర భోజనం ఏర్పాటు చేయలేదు. అందుచేత అందరికి ఈ పూటకు కరణంగారి ఇంటిలోనే భోజనాలు. రాత్రికి ఎవరికి ఏ భోజనం కావాలంటే అది ఏర్పాటు చేయిస్తాం. బట్టలు మార్చుకుని భోజనానికి పదండి బాబూ!' విన్నవించాడు మునసబు.

పి. ఓ. లు తమతమ స్టాఫ్ సరిగా వచ్చిందీ లేనిదీ సరిచూచుకొని, సామానును జాగ్రత్తగా పోలింగ్‌స్టేషన్‌లో ఉంచుకుని తలయార్లను కాపలా పెట్టి భోజనాలకు బయలుదేరారంతా.

మాధవరావు మాత్రం వాళ్ళ వెనుక వెళ్ళలేదు.

ఎలాంటి భోజనాన్నైనా చేయుగల తత్వం తనది కాదని అతని నమ్మకం. అంతేకాకుండ యింటిలో అమరినట్లు పరాయిచోట భోజనం అమరదని అతని దృఢవిశ్వాసం. ఏదో గడ్డి కరవటంకన్నా బజారు రొట్టెలే కొంత మేలని తన వెంటా బన్‌రొట్టెలను తెచ్చుకున్నాడు. నలుగురు భోజనానికి కదలగానే రెండు రొట్టెల తిని మంచినీళ్ళ త్రాగాడు మాధవరావు.

సాయంత్రం అయిదువరకు మర్నాటి రోజుకై చేయవలసిన ఏర్పాట్లు చేసికుని కొందరు పొలం గట్ల వైపు, మరికొందరు రామాలయంవైపు షికారు వెళ్లిపోయారు. మాధవరావు ఆ రోజంతా కాఫీ ముఖం చూడలేదు. ఆ కారణంచేత ఊరిలోనికి వెళ్లాడు మాధవరావు. ఆ ఊరిలో ఉన్న ఒకే ఒక టీ దుఖాణం లోకి కాలు పెడుతూంటే సూర్యం అతన్ని చూశాడు. పలుకరించబోతూంటే మాధవరావు కాఫీకి ఆర్డరిచ్చాడు. దుఖాణదారుడు కాఫీ పొడుముకు కబురెట్టి మాధవరావు ఎవరై ఉంటాడా అనే ఆలోచనలో పడ్డాడు. అదే ఆలోచనతో సూర్యం మాధవరావును సమీపించి

'మీరు ఎలక్షన్ డ్యూటీమీద కదూ ఈ ఊరొస్త !' అడిగాడు.

'అవును' అన్నాడు మాధవరావు తానేమైనా తప్పు చేశాడా అని భయపడుతూ.

'మీరు యిప్పడే ఈ ఊరికి వచ్చినట్టా !'

'లేదు మధ్యాహ్నమే వచ్చేశా !' కాస్త ధైర్యంగా అన్నాడు.

'మరయితే మధ్యాహ్నం మా యింటికి భోజనానికి వచ్చారా? వచ్చినట్టులేదే.'

'అవునండీ రాలేదు.'

'ఏం? అలా చేశారు?' నిలవదీసి అడిగాడు సూర్యం.

సమాధానంకోసం వెతుక్కోసాగాడు మాధవరావు. మాధవరావు మొహమాట పడుతున్నాడని గ్రహించాడు సూర్యం.

'అదేమిటండీ? భోజనానికి పరాయిల్లు, మన యిల్లు అని చూస్తే ఎలా? అయితే యివాళంతా భోజనం లేకుండా ఉన్నారన్నమాట. ఎంతమాట!' బాధపడ్డాడు సూర్యం.

అంతలో కాఫీ తయారైంది.

ఇద్దరూ కాఫీ త్రాగారు.

మాధవరావు వారిస్తున్నా వినక సూర్యమే కాఫీ డబ్బు లిచ్చేశాడు.

ఇద్దరూ ఊరి బయటకు నెమ్మదిగా మాటాడుకుంటూ నడిచారు.

మాధవరావు తన గురించి, కుటుంబం, ఉద్యోగం గురించి చెప్పిన వివరాలను సూర్యం విని చాల ఆనందపడ్డాడు, ఆ మాట ఈ మాట అయిన తరువాత.

'రేపు భోజనం చేయటానికి వీలు అవుతుందో అవదో రాత్రి భోజనానికి మాత్రం రావటం మరువకండి. మరి భోజనం ఏర్పాట్లు చూడాలిగా. వస్తాను' అంటూ సెలవుతీసుకుని ఊరివైపు నడిచిపోయాడు సూర్యం.

సూర్యం చూపే స్నేహ భావానికి ముగ్ధుడయ్యాడు మాధవరావు. మొగమాటం కొంత తొలగింది. సరియైన భోజనం దొరక్క గడ్డి కరవాల్సి ఉంటుందని ఆపోహ పడినందుకు తన్నుతాను నిందించుకున్నాడు మాధవరావు.

ఊరికి దూరంగా కొండలున్నాయి. ఆ కొండలు నీలంగా ఉన్నాయి. దారి ప్రక్కనే ఎండీయెండని చెఱువుంది. చెఱువులో ఆడవారెవరో స్నానం చేస్తున్నారు. ఒకప్రక్కగా గేదెల కడుగుతున్నాడు ఒక పశువులకాపరి (కాకపోతే ఒక పాలెగాడు). ఆడవాళ్ళు స్నానంచేస్తూ బట్ట లుతుకుతున్నచోటుకు కొంత సమీపంనుండి నీళ్ళు ముంచుకుపోతున్నాడు ఒక కావిడి కామయ్య. అది ఎండీయెండని చెఱువు. చెఱువువైపు చూడలేక ఊరిలోని పురిళ్ళ బీదతనాన్ని చూడటం చేతకాక దూరంగాఉన్న నీలపుకొండలవైపు దృష్టి సారించి కొంతదూరం నడిచి రోడ్డు ప్రక్కనున్న మదుముమీద కూర్చున్నాడు. ఆ కంకరరోడ్డుమీద ఎఱ్ఱనిదుమ్ము రేపుకుంటూ ఆపసోపాలు పడుతూ ఒక పార్టీ కారు ఊరిలోకి పయనించిపోయింది. ఒంటిమీద పడ్డ దుమ్ము దులుపుకొని కూర్చున్నాడు మాధవరావు. వింతవింత ఆలోచనలు వస్తున్నాయతనికి. కాని తన ఆలోచనల ఎవరైనా కనిపెడ్తారేమో అన్న భయం చేత ముఖాన్ని దారినపోయేవారికి కనపడనీయక కొండలనే చూడసాగాడు మాధవరావు. చీకటి పడుతూండగ మంచు కురవసాగింది. చలి ఎక్కువ కాసాగింది. చీకటి బాగ అలుముకుంటూంటే ఆకలి జ్ఞాపకానికి వచ్చింది మాధవరావుకి. చీకటిలో దారి చూచుకుంటూ ఎలిమెంటరీ స్కూలు చేరుకున్నాడు మాధవరావు.

అతనక్కడికి చేరేసరికి మాంసాహారాలు మున సబు యింటికి శాఖా హారులు శనివారం ఉపవాసదీక్ష

గల వాళ్లు, మాంసం ముట్టటానికి వీలుపడని దుర దృష్టవంతులు కరణంగారింటికి వెళ్లిపోయారు. ఆ విషయాన్ని తలయారే మాధవరావుకి చెప్పి అతన్ని కూడ భోజనానికి వెళ్లమని చెప్పాడు. కరణం యిల్లు మాధవరావుకు తెలియదు. తెలిసికోనైనా అక్కడికెళ్ళి ఏం చెప్పాలో తెలియదు.

అరగంట తరువాత బిలబిల మంటూ వచ్చారంతా.

'మధ్యాహ్నం భోజనానికి వెళ్లారు కార్ట. మీకోసం ఎదురు చూస్తున్నారు. వెళ్లి వెంగంగారండి కొద్దిగ మిగిలిఉన్న పనిని పూర్తిచేదాం' అంటూ ఆజ్ఞను సలహాకు జోడించి చారవేశాడు. పి. ఓ.

భోజనానికి వెళ్లాలనే ఎలిమెంటరీ స్కూలు దాటివచ్చి నిలబడ్డాడు మాధవరావు కాని ఎటు వెళ్లాలో. ఎలా వెళ్లాలో. వెళ్లి సూర్యం లేకపోతే ఎవరిని ఏమిటి అడుగాలో అడిగితే ఎవరేమను కుంటారో అని ఆలోచిస్తూ బిడియపడుతూ. తర్కించుకుంటూ కదలలేక నిలబడిపోయాడు.

స్కూలుకు దూరంగా ఉన్న పొందర గుడి సెల్లోంచి ఆడవాళ్ళెవరో బూతులు తిట్టుకుంటూ యివతలకివచ్చి జుట్లు పట్టుకుంటూ దెబ్బలాడు కుంటున్నారు. ఒక్క ప్రక్కనున్న చింతచెట్ల క్రింద ఎఱుకలవాళ్లు రాళ్ల పొయ్యిలమీద వంట చేసికుంటు న్నారు. ఆ పొయ్యిలో మండుతున్న మంటల వెలుగులో వాళ్ల నల్లని శరీరాలు, చెట్టుకొమ్మలనుండి వ్రేలాడేగుడ్డ ఉయ్యాలలు కనిపిస్తున్నాయి.

ఊరిలోకి చూశాడు మాధవరావు.

చిక్కని చీకటిలో కిరసనాయిలు దీపాలు అక్కడక్కడ మినుకు మినుకు మంటున్నాయి. ఆ చీకటిలో కదలివచ్చాడు సూర్యం.

'మీకు చాల మొహమాటమని తెలుసు. అందుకనే వచ్చాను మీకోసం రండి రండి అంటూ తొందర చేశాడు మాధవరావును.

మాధవరావు స్వేచ్ఛగా ఊపిరితీసికుని సూర్యాన్ని అనుసరించాడు.

మాధవరావును తీసికుని ఒక పురింటిముందు ఆగాడు సూర్యం.

ఇంటిముందు ఎడమప్రక్క కొబ్బరిచెట్టు మంచులో తడుస్తూ తల విరబోసుకుని పురింటిని జాలితో చూస్తోంది. ఇంటిమీద లేచిపోయిన పురి గాలిలో రెపరెపలాడుతూ కిరసనాయిలు దీపం కళ్ళు చించుకుని మాధవరావును చూడ తాపత్రయ పడుతోంది.

మంచివాళ్ళు, మంచి హృదయం కలవారు పురిళ్లలో అంటి యిళ్లలో ఉండటమా వింత పోయాడు మాధవరావు.

"సీతా!" కేకవేశాడు సూర్యం.

'వస్తున్నా నన్నయ్యా!' చింకొంగుకు చేతులు తుడుచుకుంటు వస్తూ అంది సీత.

'ఆఫీసరు గారొచ్చారమ్మా! వంట వడ్డించు' సీతకు వినిపించేంత గట్టిగా అన్నాడు సూర్యం. గడపదాటిబోయి కొత్తవ్యక్తిని చూచి వెనక్కడుగువేసి భుజంమీదిక పమిటను లాక్కుంటూ చీకటిలోనున్న సూర్యాన్ని చూస్తూ సీత.

'అయిపోయిందన్నయ్యా! విస్తరివేస్తున్నా. వడ్డన అయిపోగానే పిలుస్తా. కూచోమను' అంది వినిపించి వినిపించనంత నెమ్మదిగా.

'త్వరగా కానిచ్చేయ్యమ్మా!' అంటూ నులక మంచం వాల్చాడు సూర్యం.

సీతయింటికి వెళ్లిపోయింది.

ఇంటిలోకి కదలిపోయే సీతను చూశాడు మాధవరావు. అతనికళ్లు బెదరిపోయాయి. ఆపురింటిలో అంతటి అందం రాశీ భూతమై ఉన్నందుకు అతనికి వింతేకాదు, ఆశ్చర్యము, బాధా కలిగాయి.

వీధిలోనున్న కిరసనాయిలు దీపం వెలుగులో సీత మాధవరావును చూసిందోలేదో గాని సీతము ముఖాన్ని స్పష్టంగా చూశాడతను. వెడల్పయిన నల్లని కళ్లను, అంగమైన పెదిమలను, చూశాడు. ఆమె నడచిపోతూంటే నల్లనైన పొడవైన ఆమె జడను చూశాడు. ఆమె ఒంటిమీదిది పట్టుచీరా అనే భ్రాంతి కలిగిందతనికి. పొడవైన ఆమెమెడ, అందమైనచేతులు అతనిదృష్టిలో నిలిచిపోయాయి.

'కూర్చోండి మేష్టారూ!' అన్నాడు సూర్యం. సీతనే గుర్తుకు తెచ్చుకుంటూ కూర్చున్నాడు మాధవరావు. ఆమె ముఖమే మనసులో పదేపదే తిరుగాడుతూండగా తానామెను ఎప్పుడో ఎక్కడో చూచినట్లు తానూహించే అందాలరాశి బహుశా ఈమేయి

తనకు దర్శనమిచ్చినట్టు భావించాడు మాధవరావు. క్రితంజన్మలో ఆమెతో తనకు సంబంధం ఉండకపోతే ఆమెను తాను చూడటం సంభవంకాదని పించింది. మాధవరావుకి. తన అన్వేషణ ఫలించబోతున్నదని పించిందతనికి.

'అన్నయ్యా!' గడపదగ్గరకొచ్చి పిలిచింది సీత.

సూర్యం గడపదగ్గర కెళ్ళాడు. సీత అతనితో ఏదో అంది. సూర్యం మాధవరావువైపు తిరిగి 'అన్నట్టు మరిచాను. ఇవ్వాళ శనివారం మీరు ఫలహారం చేస్తారా? భోజనం చేస్తారా? ఈరోజు మధ్యాహ్నం మీరు భోజనం చేయలేదు కాబట్టి రాత్రి మీరు భోజనం చేయటమే ఉత్తమం. ఏమంటారు?' అన్నాడు.

నోరు పెగుల్చుకుని గంభీరతను తెచ్చిపెట్టుకుంటూ

'అలాగే కానివ్వండి' అన్నాడు మాధవరావు.

మరొక్కసారి సీతను చూడొచ్చు అనుకుంటూండగా సీత యింట్లోకి వెళ్ళిపోయింది.

కొద్దిసేపటిలో భోజనానికి పిలుపు వచ్చింది. మాధవరావు సూర్యంతోపాటు కాళ్ళు కడుగుకున్నాడు. విస్తరిలో అన్నం, ఉల్లి అల్లంవేసి వండబడిన వంకాయకూర, కొబ్బరికాయపచ్చడి వడ్డించబడి ఉన్నాయి. సీత దూరంగా తలుపుదగ్గర నిల్చుంది.

ఏదోరకమైన గంభీరాన్ని తెచ్చిపెట్టుకుంటూ, సీతను చూడాలన్న కోరిక మనసులో పదేపదే తిరుగాడుతూంటే, తలయెత్తటానికి సమయం దొరక్క తికమకపడుతూ భోజనం చేస్తున్నాడు మాధవరావు. దగ్గరగావచ్చి కూరపచ్చడి వడ్డించి వెళ్ళిపోతోంది సీత. ఆమెదగ్గరకు వస్తున్నప్పుడల్లా మనసు వెర్రిగ గెంతులు వేస్తోంది. ఆనందం పొంగులు వారుతోంది. ఏదో ఊహిస్తున్నాడు. ఏదో నిర్ణయాలు చేసికుంటున్నాడు. కాని తలయెత్తి చూడలేక పోతున్నాడు.

సూర్యం అతని దగ్గరుండి అతని అవసరాలు చూస్తున్నాడు. మాధవరావు నెమ్మదిగా పెదవులు విప్పి 'ఈ ఇంటిలో యింకెవరూ కనపడరేం?' అడిగాడు.

సూర్యం పెదవులు కదిపాడు. గుమ్మం దగ్గరున్న సీత చీకటిలోకి కదిలింది.

'ప్రస్తుతం ఈ యింటిలో ఉండేది ముగ్గురం మాత్రమే. నేనూ, సీత, మా అమ్మ, మా అమ్మ ఆరోగ్యం చాలకాలం నుండి బాగాలేదు. ఈ ఊళ్ళో వైద్యసదుపాయం లేదు. అయినా నేను అమ్మను ఎక్కడకు తీసికెళ్ళగలను?—అదిగో ఆ గదిలోనే మంచం మీద ఉంది అమ్మ. నా భార్య పురిటికెళ్ళింది. నాకు ఒక మగపిల్లాడు. ఒక ఆడపిల్ల. ఈ ఊరి ప్రక్క గ్రామమే మా అత్తవారిది. మాకు ఒకప్పుడు భూములు, యిళ్ళు, పశువులు ఉండేవి. మా పెద్దలు కూర్చొతినటం నేర్చారు. అదే మిగత వారికి నేర్పారు. నా పెళ్లి, అక్కయ్య పెళ్ళిళ్లకే ఉన్నదంతా కరిగిపోయింది. కష్టాలు, అప్పులు నాకు మిగిలాయి. మా నాన్న నాకై యిచ్చినదేదీ లేదు. ఈ యిల్లు నే సంపాదించుకున్నదే. అయితే ఎవరూ నాకేం పెట్టక్కరలేదు. ఎవరూ యిటు తిరిగి చూడకపోయినా నాకు లోపం లేదు. నా వృత్తి నాకు, నా కుటుంబానికి తిండిపెడుతుంది— ఎటొచ్చీ సీత గురించే నా బాధ— సీత నా చెల్లెలు — చాల మంచిపిల్ల —పనీపాటూ అన్నీ వచ్చు— దానికి పెళ్లి చెయ్యాలి – అదే నా బాధ్యత. పెళ్లంటే మాటలా – కట్నాలివ్వాలి— కానుక లివ్వాలి—ఈ యిల్లు అమ్మేసైనా చేయాలని ఉంది. కాని ఈ ఊళ్లో కొనేదెవరు?—కొన్నా, చెడిపోతున్నవాడిని యింకా చెడగొడతారు గాని బాగుపరచరు — అదేమిటి? ... యింకా కొద్దిగ అన్నం తియ్యండి... మిరియాల చారుంది... సీతా చారు!... పచ్చడి వేయించమంటారా? ... సీతా! కొద్దిగ కొబ్బరి పచ్చడి... మీరు అనవసరంగా మొహమాట పడుతున్నారు... ముఖమాట మేం పడనక్కరలేదు— ఇది మీ యిల్లే అనుకోండి ... మీ అమ్మగారూ, మేమూ ఒకే గోత్రీకులం...మరేం ఫరవాలేదు...'

'కరణంగారూ!' వీధిలోంచి పిలుపు.

'వస్తున్నా! భోజనం చేస్తూండండి వచ్చేస్తాను' అంటూ వీధిలోకి వెళ్లాడు సూర్యం. కొద్దిసేపటిలోనే తిరిగి వచ్చాడు వస్తూ అన్నాడు.

'మాష్టరూ! ఆర్. ఐ. గారొచ్చార్ట. కలిసి వస్తాను—ముఖమాటం లేకండ భోజనం చేయండి— సీతా వడ్డన సరిగాచూడు - వచ్చేస్తా వేగంగా' అంటూ వీధిలోకి పరుగెత్తాడు సూర్యం.

మాధవరావు విస్తర్లో ఉన్నకొద్ది అన్నా నే ముందుకు తీసికుని కలుపసాగాడు.

'అన్నం వెయ్యనా ?' నెమ్మదిగా అడిగింది సీత.

కావాలనాలో, వద్దనాలో తెలియలేదు అతనికి.

'కొద్దిగ వేయించుకోండి' అంటూ అన్నం వడ్డించింది.

'చాలు! చాలు' అన్నాడు మాధవరావు.

మజ్జిగ పోసింది సీత. మరి కొద్దిగ పచ్చడి వేసింది.

'వద్దండి! చాలండి' అన్నాడు కంగారు పడుతూ.

'ఫరవాలేదు. మధ్యాహ్నం భోజనం లేదట కదా!'

తల ఎత్తాడు మాధవరావు. చేతి మట్టిగాజుల వంకే తదేకంగా చూచుకుంటున్న సీత మాధవరావు భోజనం చేయటం మానటం చూచి తలయెత్తి అటు చూచింది. అతను తనవైపే చూపటం చూచి కంగారుగా తల దించుకుంది. మాధవరావు మాత్రం చూపుల మరల్చుకోలేక పోయాడు.

ఆ కళ్లలో ఎంత వెలుగుందీ! ఆ పెదవుల మీద ఎంత వెన్నెలుందీ? తానెందుకొచ్చా డిక్కడికి? సీతకోసం కాదూ! సీతను దక్కించుకోడానికే కదూ తానిక్కడికి వచ్చింది! ఏమైనా సీతను తాను వదులుకోకూడదు. సీతలాంటి పిల్ల భార్యగా లభించటం సామాన్యమైన విషయం కాదు. తాను మధ్యాహ్నం భోజనం చేయలేదని ఆమెకు తెలుసట. భోజనం చేయకపోతే ఆమెకెందుకంత బాధ! ఎంత అందమైనవా కళ్లు! తల ఎత్తి చూడదేం!............'

'భోజనం చేయండి' హెచ్చరించింది సీత.

మాధవరావు తలదించుకుని భోజనం చేయటంలో నిమగ్నమయ్యాడు.

విస్తరిముందునుండి లేవబోతూంటే అంది సీత 'పెరటిలో నీళ్లున్నాయి' పెరటిలోకి వెళ్లాడు. చీకటిలో ఏది ఎక్కడుందో తెలియలేదతనికి. వెను వెనే హరికెన్ లాంతరుతో వచ్చిందిసీత. చీరకుచ్చిళ్లను బొడ్లో దోపుకుని బిందెలోనున్న నీళ్లను చెంబుతో అందించింది. చెంబునందుకుని చేయి కడుక్కుని రుమాలునందుకుంటూంటే తీగమీదనున్న తుండుగుడ్డను చూపించింది. సీత. చేతులు తుడుచుకొని, చాచిన ఆమె చేతికి తుండుగుడ్డ నందించాడు. ఆమె మెత్తనిచేయి అతని చేతికి తగిలింది. ఆమె ఏమనుకుందో అతనికి తెలియలేదు.

మాధవరావు గొంతు సవరించుకొని అన్నాడు.

'సీత!...సీతగారూ!......మీరు...మీరు...... చాల అందంగా ఉన్నారు' అని. ఆ మాట నన్న తరువాత తానామాట ననగలిగాడా అని ఆశ్చర్యపోయాడు.

ఆమె భయపడిందో, కోపగించిందో, సిగ్గుపడిందో ఆ చీకటిలో తెలియలేదతనికి. సీత కదలి వెళ్లబోయింది.

'మీరు నాకు నచ్చారు. నేను మిమ్మల్ని పెళ్లి చేసికుంటాను. నేనంటే మీకు యిష్టమేనా? నన్ను పెళ్లి చేసికుంటారా?' అడిగాడు.

ఆశ్చర్యబోయింది సీత. సిగ్గుతో తలవాల్చుకోబోయింది.

'నిజం సీతా! మీరు నాకు నచ్చారు...నన్ను నన్ను...పెళ్లి చేసికుంటారా?' చొరవగా ఆమె చేతులు పట్టుకున్నాడు.

యిష్టమే అని అనాలని ఉంది సీత. కాని ఎలా అనాలో తెలియలేదు ఆమె ముందున్నది చీకటి కాదు. పండువెన్నెల—ఆ వెన్నెల్లో కొబ్బరిచెట్టు క్రింద పాతికేళ్ల అందమైన నిండైన విగ్రహం తన చేతులు పట్టుకుని అడుగుతున్నాడు. ఇది కలకాదు. నిజం. అతని కళ్లలో ఉన్నది కాంక్షకాదు—మాటల్లో నిజాయితీ ధ్వనిస్తోంది.

అతని టెర్లిన్ షర్టు. పలుచని షర్టు జేబులోని పది రూపాయల నోట్లు. చేతినిఉన్న ఉంగరాలు ఆమె కళ్లలో మెదిలాయి. చేతుల్ని అతని చేతుల్లోంచి తీసికుని కంగారుగా 'మేము... మేము... మీలా ధనవంతులంకాము .. మాది .. మాది పేదకుటుంబం... పెళ్లి... అసలు... అసలునాకేం తెలియదు...' అంది.

'నీకా సంశయం అక్కరలేదు సీత! నేను మా అమ్మకి నాన్నకి ఒకడినే, నా మాట కాదనరు. నీవు 'ఊ!' అను అంతే! చాలు' అన్నాడు కొద్దిగ సమీపానికివచ్చి

'ఏమో!... ఏమో!... నాకేం తెలియదు...మా అన్నయ్య నడగండి'

'తప్పక అడుగుతాను సీతా! మరి నీకు యిష్టమే కదూ! నేలవైపు చూస్తున్న ఆమె ముఖంవైపు చూడ ప్రయత్నిస్తూ అన్నాడు.

సీత అవుననలేదు. కాదనలేదు. సిగ్గుతో తల ప్రక్కకు తిప్పుకుంది.

'థాంక్సు' సీతా!' అన్నాడు మాధవరావు. ఇద్దరూ యింటిలోకి వచ్చారు.

ఇంటిలోని దీపం వెలుగులో సీతను మరింత స్పష్టంగా చూశాడు.

తలంటు పోసికున్న ఆమె, నుదుటపై ఆడే ముంగురులతో అందంగా ఉంది.

ఆమె కనుపాపలలో వెన్నెల జలపాతమై కురుస్తోంది.

ఆమె పెదవులపై తేనియరంగు ఆ వెన్నెల్లో ప్రతిఫలిస్తోంది.

ఆమె కట్టిన కలనేతచీర పట్టుచీరలా మెరుస్తోంది. నడుమున కిరువైపులా ఉరుభాగాలమీద వక్షస్థలంపై చిత్రకారుడు దిద్దిన మెరుపులున్నాయి.

'అన్నయ్య వస్తాడు. వీధిలో కూర్చోండి.' కుడిచేతి గాజులను మోచేతిమీదకు లాక్కుని పనిలో నిమగ్నం అవుతూ అంది సీత. మాధవరావు బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు.

అతను నులకమంచంమీద కూర్చున్న కొద్ది సేపటిలో వచ్చాడు సూర్యం.

'భోజనం అయిందా?'

'అయిందండీ! మీ రొస్తారనే కూర్చున్నాను.'

'ఆర్. ఐ. గారు కబురుపెట్టారు. వెళ్లాను. రేపు పనిలో చాల హడావుడిగా ఉండిపోతారు. నిజంగా మీకు ముఖం మాట ఎక్కువ. రేపు మీకు ఏ మాత్రం అవకాశంఉన్నా వచ్చేయండి. నేను అక్కడే ఉంటాను లెండి. బూత్స కట్టడానికి దుప్పట్లు కావాలట. ఊళ్లో అడగాలి. ఈ చలికాలం ఎవరిస్తారు చెప్పండి. పదండి. మిమ్మల్ని స్కూలు దగ్గర దిగబెట్టేసి నే ఊళ్లోకి వెళ్తాను' అన్నాడు సూర్యం.

మాధవరావు లేచాడు. సీతకోసం చూశాడు. సీత కనిపించలేదు. 'సీతా ! మేం వెళ్తున్నాం' అని కేకవేసి ఆమె సమాధానంకోసం వేచిఉండక బయలుదేరాడు సూర్యం. బయలుదేరబోతూ సీత కోసం చూశాడు మాధవరావు సీత కనపడలేదు. సూర్యం ముందుకు కదిలాడు. మాధవరావు ముందుకు కదిలాడు సూర్యంతో.

మర్నాడు పోలింగు తేదీ.

ఉదయం పదిగంటలవరకూ పోలింగు మందకొడిగా సాగింది. అటుతరువాత జనంవచ్చి పడిపోయారు. క్యూలు పెరిగిపోయాయి. మాధవరావు చురుకుగా పనిచేయటంచేత ఏ. పి. ఓ. ప్రక్క సీటే అతనికీయబడింది. బాధ్యతాయుతమైన సీటు అది. ఊపిరి తీసికోటానికి వీలులేని పరిస్థితి—ఓ 'క కావాలి. చిరాకు పడకూడదు— ఓటర్లచేత సక్రమంగా ఓటు చేయించాలి. మాధవరావుకు సీటు కదలటానికి వీలు లేకపోయింది. అప్పటికే పి. ఓ. మార్కింగ్ క్లర్కుని, బేలట్ బాక్సుదగ్గర కూర్చున్న అతన్ని భోజనానికి పంపాడు. తరువాత ఏ. పి. ఓ.ను పంపాడు. సూర్యం రెండుమూడుసార్లువచ్చి మాధవరావును చూచి వెళ్లాడు.

'మీరు భోజనానికి వెళ్లిరండి !' పి. ఓ. అన్నాడు.

అప్పటికి జనం కొంత పల్చబడ్డారు.

మాధవరావు సీతకోసం చూస్తున్నాడు. తాను భోజనానికని బయలుదేరితే, సీత ఓటుచేయడాని కదే సమయంలోవస్తే సీతను కలియటం కాదేమో. సీతను యింటిదగ్గర చూడటం అసంభవమేమోగాని ఓటు చేయటంకోసం వచ్చే సీతను చూడటం సంభవం అనుకున్నాడు. కాని సీత తనకోసమే ఎదురుచూస్తూ తన ఓటును వృధాపరచుకొని ఉండిపోయిందని మాధవరావుకు తెలియదు.

మాధవరావు వాచీ చూచుకున్నాడు 'రెండు గంటలయింది. ఇప్పుడేం భోజనం?' అన్నాడు. అతని మాటల విన్నాడు కాబోలు సూర్యం చపాతీ చేయించి తెచ్చాడు. సూర్యాన్ని చూడగానే సీతే తనకోసం శ్రమ తీసికుని ఉండిఉంటుందని అర్థమైందతనికి.

మళ్ళా క్యూలు పెరగసాగాయి మళ్ళా మాధవరావుకు చేతినిండాపని. ఎందరో వచ్చారు. ఓటు చేశారు. సీత రాలేదు. సూర్యం రాగానే ప్రక్కకు పిలిచి అడిగాడు. 'సీతగారు రాలేదేం?' అని.

'ఇప్పటివరకూ భోజనాలవుతూనే ఉన్నాయి. రాత్రికి ఎవరికైనా వంట చెయ్యాలో ఏమో!' దానికి రావటానికెలా అవుతుంది?' అన్నాడు సూర్యం.

మాధవరావు మనసు చివుక్కుమంది. సీత తన స్వంతం అన్నభావం అతనిలో ఉండటంచేత బాధను నిగ్రహించుకోవటం అంతగ చేతకావటం లేదతనికి.

'ఇంతమందికీ, వంటవండి, వడ్డించి, వాళ్ల ఎంగిళ్లు ఎత్తటానికి సీత దాసీదా?'

అతని మనసు విలవిల లాడింది.

సీత అందం తన్నెంతగ ఆకర్షిస్తోందో, ఆమె పరిస్థితి కూడ తన్నంతగ బాధిస్తోందని అర్థమైంది మాధవరావుకి.

'ఇది ఇకముందు కొనసాగకూడదు' అనుకున్నాడు.

పోలింగ్ రాత్రి ఏడు గంటలవరకూ సాగింది.

అప్పటికీ రెండువందల ఓటర్లు నిస్పృహచెంది వెళ్లిపోయారని గ్రామం బాధపడింది రాత్రి పన్నెండు గంటలయినా ఓటు చేయించాలని కొందరి వాదన.

సాయంత్రం అయిదుగంటలప్పుడు స్టేషన్ ప్రాంగణంలో ఉన్నవారికి ఓటు హక్కు అని పి. ఓ. ల వాదన.

గ్రామం పి. ఓ.ల క్షమించలేకపోయింది.

మాట మాట పెరిగింది. ఏదో కొంత ఎవరో తగ్గాలి. ఎవరూ తగ్గరు.

రాత్రి ఏడు గంటలకు పోలింగ్ ముగిసినట్టు పి. ఓ. లు ప్రకటించారు.

అవతలమాత్రం తర్జనభర్జన పడుతున్నారు. కొందరు పి. ఓ.లదే రయిటు అంటున్నారు. మరి కొందరు రూలు ప్రకారం నడిస్తే ఈ రోజుల్లో మెతుకులు దొరకవు అంటున్నారు. ఏమైనా పరిస్థితి అంతప్రశాంతంగా ఉండేటట్టు కనిపించలేదు మాధవరావుకి. ఆ రాత్రికి అక్కడ ఉండి సీత గురించి సూర్యంతో మాటాడి, సీతనుచూచి వెళ్లాలని అనుకున్న మాధవరావు ఆ రాత్రి తానక్కడ ఉండటం తనకేకాక, ఎవరింటఉన్నా వారికి క్షేమంగాదని గ్రహించాడు. పి. ఓ.లతో కలిసి రాత్రే లారీలో వెళ్లిపోవాలని ఉంది. కాని సీతను చూడకండ వెళ్లడమెలాగో తెలియటం లేదతనికి.

రాత్రి ఎవరికీ భోజనాలు గుర్తుకురాలేదు.

మునసబే అందరికి టిఫిన్ పంపించాడు.

సీత నొక్కసారి చూచి వచ్చేస్తాను అని అనుకుంటూండగా లారీ వచ్చేసింది.

'టవున్‌కి వచ్చేవాళ్లు వచ్చేయండి. మరి వీూకు రేపు ఉదయం పదిగంటలవరకు లారీగాని బస్సుగాని దొరకదు. అదయినా రోడ్డు పాయింటుకు వెళ్తేనే.' గైడ్ హెచ్చరించాడు.

మాధవరావుకు అక్కడనుండి కదలాలని లేదు. కాని కదలక వీలులేని పరిస్థితి. మాధవరావు ఏదీ తేల్చుకోని పరిస్థితిలో లారీలోంచి అతని మిత్రులు రమ్మని తొందర చేశారు. తలయారి అతని సామాను కూడ లారీలోకి ఎక్కించాడు.

'రండి రండి' ఏ. పి. ఓ. చేయి పట్టుకొ లాగాడు.

మిత్రులు చేతులు పట్టుకు లారీలోకి దిగారు.

లారి ఎక్కి నిల్చున్న మాధవరావు సూర్యం కోసం చూశాడు.

లారీ చుట్టు జనం. రెండుచోట్ల పెట్రొమాక్సులైట్ల వెలుగు కుప్పబడి ముద్దగా ఉంది. మిగతా చోటంతా పల్చని చీకటి. సూర్యం ఎక్కడా కనపడలేదు.

సూర్యం యింటివైపు చీకటిలోంచి కళ్లు చించుకొని చూశాడు.

దూరంగా కొబ్బరిచెట్లమధ్య చింపిరితలలతో, మంచులో తడుస్తూ కనిపించింది సూర్యం యిల్లు. ఇంటిలో దీపం మినుకుమినుకు మంటోంది. సీత మాత్రం కనపడలేదు అతనికి. లారీ కదిలింది.

* * *

మాధవరావు పెళ్ళయింది వైభవంగా సంవత్సరానికే.

ఓటర్లు డబ్బుకు అమ్ముడుపోయార్ట. ఆ ఊరు మాత్రమలాగే ఉంది.